

లింగమనాయుడుపల్లిలో వైద్య శిబిరం

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



తొట్టంబేడు మండలంలోని లింగమనాయుడుపల్లి గ్రామంలో తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. లింగమనాయుడు పల్లెలో ఫీవర్ ఫియర్ అనే శీర్షికన 'ప్రజాశక్తి'లో వార్త ప్రచురితమయ్యింది. స్పందించిన వైద్యాధికారులు హుటాహుటిన గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జ్వర పీడితులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వ్యాధుల బారినపడకుండా ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలో వైద్యాధికారిణి లహరి గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

'కూలి'న బతుకులు





కె.శ్రీనివాసులు

రోదిస్తున్న బి.శ్రీనివాసులు భార్య ప్రమీల


బి.శ్రీనివాసులు

తన్నీర్ వసంత్

- ముగ్గురు భవన నిర్మాణ కార్మికులు మృతి
- మృత్యుంజయుడు 'కూలి' మాధవ్
- అడుగడుగునా నిబంధనల అతిక్రమణ
- పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్, ఈవోపీఆర్‌డీకి నోటీసులు
- రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలి: సిఐటియు
- ఘటనా స్థలంలో పిక్కటిల్లిన రోదనలు

'ఏ నిమిషానికి ఏమి జరుగునో ఎవరూహించెదరు'.. ఎప్పటిలాగే ఐదంతస్తుల పైన గోడకు సిమెంట్ పూతపని చేయడానికి మంగళవారం ఉదయం 'సారవ' పైకి ఎక్కిన భవన నిర్మాణ కార్మికులు కర్ర జారిపోవడంతో ఒక్కసారిగా పైనుంచి కింద పడిపోయారు. ఘటనా స్థలంలోనే ముగ్గురు కార్మికులు దుర్మరణం పాలయ్యారు. వీరితో పాటే సారవ ఎక్కిన మాధవ్ కర్రను గట్టిగా పట్టుకోవడంతో బతికి బయటపడ్డాడు. అయితే కళ్లెదుటే తోటి కార్మికులు రక్తపు మడుపులో పడి ఉండడంతో కొంతసేపు నిశ్చేష్టుడయ్యాడు. వీరిలో ముగ్గురు కార్మికులు బతుకుదెరువు కోసం ప్రకాశం జిల్లా నుంచి పదేళ్ల క్రితం వలస వచ్చి శ్రీకాళహస్తిలో స్థిరపడిన వారు. పనికి వెళ్లిన భర్త మృతిచెందాడని వెళ్లిన కొద్దిసేపటికే తెలియడంతో బి.శ్రీనివాసులు భార్య ప్రమీల ఘటనా స్థలంలో కన్నీళ్ల పర్యంతమయ్యింది. 'పిల్లలకు ఇంకా దిక్కెవరు' అంటూ కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు ఆ ప్రాంతంలో మిన్నంటాయి. అయితే భవన నిర్మాణ యజమాని నిర్మాణం ఆద్యంతం అక్రమంగా, నిబంధనలు ఉల్లంఘిస్తూ, ఎటువంటి జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఈ ఘటన జరిగిందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఆరోపించారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై కలెక్టర్ వెంకటేశ్వర్ సీరియస్ అయ్యారు. పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేశారు. ఈవోపిఆర్‌డికి నోటీసులు జారీ చేశారు. వివరాలిలా ఉన్నాయి.

కాళ్లు వణికిపోయాయి : మాధవ్, మృత్యుంజయుడు



నాతో కూడా పనికి వచ్చిన వాళ్లు భవనం ఐదో అంతస్తు నుండి పడిపోవడంతో కేకలు వేస్తూ పైనుంచి కిందకు పడిపోతున్న వాళ్ళని చూసి నా కాళ్లు, చేతులు వణికిపోయాయి. పైనుండి కింద పడకుండా కర్రను గట్టిగా పట్టుకోవడంతో నేను బతికిపోయాను. పైనుండి నా తోటి కార్మికులు కింద పడి ఒక్కసారిగా చనిపోవడాన్ని చూడడంతో దిక్కు తోచని పరిస్థితుల్లో పైనున్న నేను కిందికి దిగడానికి నా కాళ్లు సహకరించలేదు. వణికి పోసాగాయి. నిదానంగా కిందకు వచ్చి చూస్తే వారిలో కె. శ్రీనివాసులు కొన ఊపిరితో ఉన్నాడు. తన్నీరు వసంత్, బి. శ్రీనివాసులు అప్పటికే మృతి చెందారు. భవనం పై నుండి కర్ర సాయంతో బతికి బయటపడ్డ కావలికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు మాధవ్ 'ప్రజాశక్తి'తో చెప్పిన మాటలివి.

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

భవన యజమాని కడివేటి అండాలయ్య విశ్రాంత ఉపాధ్యాయుడు. 2017లో ఉద్యోగ విరమణ పొందాడు. స్వాధీన అనుభవంలోని స్థలంలో తుడా నుంచి మూడు అంతస్తులకు అనుమతి తీసుకుని ఐదంతస్తుల భవనం నిర్మాణం చేపట్టాడు. భవనం పైన ఐదో అంతస్తు వెలుపలి భాగంలో పూత పనిచేయడానికి ఎప్పటిలాగే నలుగురు భవన నిర్మాణ కార్మికులు 'సారవ' పైకి ఎక్కి పనులు ప్రారంభించారు. ఒంగోలు జిల్లా ఆకర్లపూడి గ్రామానికి చెందిన తన్నీరు వసంత్, కె.శ్రీనివాసులు (వీరిద్దరూ బావ బావమరుదులు) పదేళ్ల క్రితం ఒంగోలు నుంచి వచ్చి శ్రీకాళహస్తి సంత మైదానం కాలనీలో నివాసం ఉంటున్నారు. బోటతొట్టి శ్రీనివాసులు (38) అండాలయ్యకు బావమరిది. తన్నీరు వసంత్‌కు ముగ్గురు పిల్లలు. బి.శ్రీనివాసులుకు ముగ్గురు పిల్లలు. బి.శ్రీనివాసులు భార్య ప్రమీల పెళ్లకూరు మండలంలో విఒఎగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ ఘటనలో మృత్యువు నుంచి బయట పడిన మాధవ్ కూడా కావలి వాస్తవ్యుడు. ఘటన జరిగిన వెంటనే 108కి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి పరీక్షించి మృతిచెందారని ధృవీకరించారు. విషయం తెలుసుకున్న తిరుపతి ఆర్డిఓ రామ్మోహన్, ఏఎస్పి రవి మనోహరాచారి, తిరుపతి అర్బన్ తహసిల్దార్ భాగ్యలక్ష్మి, డీఎస్పీ బి.ప్రసాద్, తుడా అధికారులు, కార్మిక శాఖ అధికారులు పరిశీలించి భవన యజమాని నుండి, బాధిత కుటుంబ సభ్యుల నుండి వివరాలను నమోదు చేసుకున్నారు. అనంతరం మతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలించారు.

ఘటనపై కలెక్టర్ ఆగ్రహం....

మంగళం తిరుమల నగర్ గ్రామపంచాయతీ తుడా క్వార్టర్స్ లో జరిగిన భవన నిర్మాణ కార్మికుల మతి ఘటనపై జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారుల పర్యవేక్షణ లోపంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే గ్రామపంచాయతీ కార్యదర్శి స్వాతిశ్రీని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మండల ఈవోపీఆర్డీ మాధురికి షోకాజ్ నోటీసులను జారీ చేశారు. అనుమతి లేకుండా భవన నిర్మాణం చేసిన యజమాని అండాలయ్యపై కేసు నమోదు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్మిక శాఖ అధికారులు సంబంధిత భవన యజమానికి కార్మిక నష్టపరిహార చట్టం కింద నోటీసును అందజేశారు.

కార్మికుల మృతిలో ఎవరికి ఎంత బాధ్యత...?

మంగళం ప్రాంతంలో ఉన్న తుడా క్వార్టర్స్ కాకుండా మిగిలిన హ్యాబిటేషన్స్‌లోనూ అనుమతులు లేకుండా ఐదు అంతస్తుల భవనాలు అనేకం ఉన్నాయి. పర్యవేక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నా... రాజకీయ ఒత్తిళ్లు కావచ్చు.... అధికారులను లోబరుచుకోవడం కావచ్చు కారణం ఏదైనా ఇటువంటి ఘటన జరిగినప్పుడే ఈ సందేహం, ఇటువంటి విషయాలు సహజంగా అందరికీ గుర్తుకు వస్తుంటాయి. పంచాయతీ పరిధిలో ఇల్లు నిర్మించుకోవాలంటే ఇక్కడినుండి జి ప్లస్ 2 కు మాత్రమే అనుమతి ఇస్తారు. తిరుపతి పట్టణాభివద్ధి సంస్థ అప్రూవ్ చేసిన లేఅవుట్లలో నిర్మాణం చేసుకోవాలంటే తప్పనిసరిగా ఆ స్థల యజమాని వారి వద్ద తగిన రుసుములు చెల్లించి అనుమతులు తీసుకోవాలి. తుడా నుండి 2 అంతస్తులు, 3 అంతస్తులు, 5 అంతస్తులకు అనుమతులు పొందుతారు. కానీ కొంతమంది భవన యజమానులు తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకుని తీసుకున్న అంతస్తుల నిర్మాణం అనుమతులు కన్నా ఎక్కువ అంతస్తుల నిర్మాణం చేసుకుంటారు. దీనిపై అనుమతులు మంజూరు చేసిన సంస్థ పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. కానీ మంగళం పరిధిలో అటువంటి పర్యవేక్షణ జరగలేదనే చెప్పాలి. ఎన్నో భవనాలు అనుమతులు తీసుకోకుండానే ఐదు అంతస్తులు నిర్మించేసుకున్నారు. మంగళవారం తుడా క్వార్టర్స్‌లో జరిగిన ఈ ఘటనతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డ అధికార యంత్రాంగం హుటాహుటిన అనుమతి లేని భవనాలను గుర్తించడానికి కింది స్థాయి సిబ్బందికి ఆదేశాలు ఇచ్చింది. భవనం పై నుండి పడ్డ కార్మికులకు ప్రభుత్వం నుండి రూ.50 వేల రూపాయలు ఇస్తున్నట్లుగా తెలుస్తోంది. పర్యవేక్షణ లోపం కారణంగానే ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని అధికార యంత్రాంగానికి తెలిసినా పట్టి పట్టనట్టు వ్యవహరించి నేడు కంటితుడుపు చర్యగా చర్యలు తీసుకుంటే సరిపోతుందా అని ప్రజలు వాపోతున్నారు.

రూ.50 లక్షల చొప్పన పరిహారం చెల్లించాలి : సిఐటియు

కూలీలు మృతిచెందిన ఘటనలో సంబంధిత అధికారుల నిర్లక్ష్యం, యజమాని నేరపూరిత చర్యలు ఉన్నాయని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఓ ప్రకటనలో తీవ్రంగా ఆరోపించారు. ముగ్గురి మతికి కారణమైన భవన యజమాని అండాలయ్యను అరెస్టు చేసి జైలుకు పంపాలని, ఆయన ఆస్తులను సీజ్ చేసి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. మరణించిన కూలీల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జి+3 అనుమతులు భవన యజమానికి ఉండగా జి+5 నిర్మాణాలు గత కొన్ని నెలలుగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదంటే, అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. వాస్తవంగా తిరుపతి నగరం, తిరుపతి రూరల్, మంగళం, బిటిఆర్ కాలనీ, తిరుమల నగర్, రామచంద్రపురం, చంద్రగిరి తదితర ప్రాంతాలలో పెద్ద సంఖ్యలో బిల్డింగ్ నిర్మాణాలు సాగుతున్నాయని, అపార్ట్ మెంట్లు పేరుతో జరుగుతున్న నిర్మాణాలు పెద్ద సంఖ్యలోఉన్నాయన్నారు.

ఘటనా స్థలంలో పరిశీలించిన సిఐటియు నాయకులు

తిరుపతి రూరల్ తుడా క్వార్టర్స్ లో కడివేటి ఆండాలయ్యకు చెందిన నిర్మాణంలో ఉన్న ఐదు అంతస్తుల భవనం పై నుండి జారిపడి ముగ్గురు కూలీలు మృతిచెందిన ఘటనా స్థలాన్ని సిఐటియు నాయకులు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కె.వేణుగోపాల్, పి.మునిరాజా, చిన్నా, ఎన్‌డి శ్రీను పరిశీలించారు.



ఘటనా స్థలాన్ని పరిశీలించిన సిఐటియు నాయకులు



తుపాన్ మునక ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి -దొరవారిసత్రం

దొరవారిసత్రం మండల పరిధిలోని లోతట్టు గ్రామాలైన బురదమడుగు, వేటగిరిపాలెం గ్రామస్తులకు నీటిమునక సమస్య నుంచి శాశ్వత పరిష్కారం చూపిస్తామని సూళ్లూరుపేట ఎంఎల్ఎ నెలవల విజయశ్రీ హామీ ఇచ్చారు. మంగళవారం బురదమడుగు గ్రామంలో భూవివాద సమస్య, ముంపు ప్రాంత సమస్యపై ఆమె మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా ఇళ్లపైకి నీరు రాకుండా అడ్డుకట్టగా ఉన్న కట్టను చదును చేసి పొలాలుగా మార్చేయడంతో మునక సమస్యకు కారణమయ్యిందని, ప్రభుత్వ భూమిని పట్టా భూమిగా మార్చేశారని గ్రామస్తులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి ఏటా అధిక వర్షాలు, తుపాను ప్రభావంతో ఇళ్లు వదిలి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని మొర పెట్టుకున్నారు. ఎంఎల్ఎ స్పందిస్తూ రెవెన్యూ రికార్డుల ప్రకారం అది గతంలో పట్టా భూమి అని, నలుగురిపై పట్టా ఉన్న 24 సెంట్లు భూమిని భూమి కొనుగోలు పథకం కింద వారి నుండి కొని కట్ట నిర్మాణం చేపట్టడానికి ఆర్డీవో, ఇరిగేషన్ ఎస్ఇకి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని వివరించారు. శాశ్వత పరిష్కారంగా ఈ గ్రామం మునక నుండి కాపాడేందుకు కట్ట నిర్మాణంతోపాటు, కాలంగి నది పొర్లు కట్ట, చెరువు కట్టకు రెండు విశాలమైన తూములను ఏర్పాటు చేయడం జరుగుతుందని వెల్లడించారు. స్థానిక రైతు ప్రసాద్ రెడ్డి ఆ భూమి వివరాల గురించి వివరిస్తూ గతంలో ఉన్న పాత రికార్డులను తారుమారు చేసి, అసైన్మెంట్ భూమిని పట్టా భూమిగా మార్చి కట్ట నామరూపాలు లేకుండా చేశారని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వివరించారు. ఆ గ్రామస్తులు కొందరు స్మశానానికి సరైన మార్గం లేదని చెప్పడంతో, త్వరితగతిన ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ శైలకుమారి, సర్వేయర్ నాగరాజు, ఎస్ ఐ అజయ్ కుమార్, మండల పార్టీ కన్వీనర్ వేమసాని శ్రీనివాసులు నాయుడు, టిడిపి మహిళా నాయకురాలు గుత్తి గుంట ప్రమీల, ఎస్సీ సెల్ అధ్యక్షులు గోను జకరయ్య, మైనారిటీ నాయకుడు షబ్బీర్, సంచివిజయ్ కుమార్ పాల్గొన్నారు.

రైతులందరికీ నష్టపరిహారం చెల్లిస్తాం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - గూడూరు టౌన్



క్రిస్ సిటీ సెజ్ లో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం విషయంలో ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని, అర్హులైన రైతులందరికీ నష్టపరిహారం ప్రభుత్వం చెల్లిస్తుందని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులు క్రిస్ సిటీ సెజ్ లో భూములు కోల్పోయిన రైతులకు అన్యాయం జరుగుతుందని, అసత్య ప్రచారాలు చేస్తున్నాయని అన్నారు. గతంలో 1, 2 లక్షల రూపాయలు భూములు విలువ ఉండగా ఈరోజు వారికి 8 లక్షల రూపాయల నష్టపరిహారం ప్రభుత్వం చెల్లిస్తుందని అన్నారు. ఈ సమావేశంలో శీలం కిరణ్ కుమార్, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి ప్రాంతీయ సిఐటియు నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



సీఐటీయూ శ్రీకాళహస్తి ప్రాంతీయ కమిటీ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆ సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. అధ్యక్షులుగా కావేరిపాకం వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా పెనగడం గురవయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తమ వంతు శక్తి వంచన లేకుండా పోరాడతామని అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.

పాత్రికేయులపై దాడి అమానుషం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

విధి నిర్వహణలో ఉన్న సాక్షి విలేకరులపై కూటమినేతలు మూకుమ్మడిగా దాడి చేయడం సభ్య సమాజం తలదించుకునే హేయమైన చర్యగా శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మసూదన్ రెడ్డి అభివర్ణించారు. ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత సాక్షి విలేకర్లను మంగళవారం మధుసూదన్ రెడ్డి పరామర్శించారు. మీడియాపై ఇలాంటి తరహా దాడులు ఏ ప్రభుత్వంలో జరిగినా ఆక్షేపణీయమని ఖండించారు. దీనిపై న్యాయపరంగా పోరాడతామని స్పష్టం చేశారు. పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తిలో ఈ తరహా దాడులు మంచిది కాదనీ, బాధ్యులను పోలీసులు అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, పగడాల రాజు, శ్రీవారి సురేష్, పటాన్ ఫరీద్, ఉత్తరాజి శరవణ కుమార్ పాల్గొన్నారు.

టీటీడీకి రైడ్ ఆన్ స్వీపర్ మెషిన్ విరాళం

ప్రజాశక్తి - తిరుమల

మల్టీ పర్పస్ క్లీనింగ్‌కు ఉపయోగించే రూ.25 లక్షలు విలువైన రైడ్ ఆన్ స్వీపిర్ మెషిన్ మంగళవారం టీటీడీకి విరాళంగా అందింది. అధునాతన జర్మన్ టెక్నాలజీతో తయారు చేసిన ఈ మెషిన్ బ్యాటరీ తో పని చేస్తుంది. శ్రీవారి ఆలయం ముందు అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి రోస్సరి ప్రొఫెషనల్ కంపెనీకి చెందిన ప్రతినిధులు మెషిన్ ను అందజేశారు.





మూడు నెలలుగా అందని జీతాలు

ఎస్వీయూలో కాంగ్రెస్ ధర్నా

ప్రజాశక్తి - క్యాంపస్

ఎస్వీ యూనివర్సిటీలో వీసీకి, రిజిస్ట్రార్‌కు, ప్రొఫెసర్లకు, పెన్షనర్లకు మూడు నెలలుగా జీతాలు రాలేదని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు మంగళవారం ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా చింతామోహన్ మాట్లాడుతూ తిరుపతికి రావాల్సిన రాజధాని రాలేదని, అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం లేదని, మన్నవరం ఆగిపోయిందని, దుగరాజపట్నం ఓడరేవు ఆపేశారని మండిపడ్డారు. ఎస్వీ యూనివర్సిటీలో పనిచేసే వీసీకి, రిజిస్టార్ కి, ప్రొఫెసర్లకి, పెన్షనర్లకు మూడు నెలలుగా జీతాలు రావడం లేదన్నారు. అమరావతికి లక్ష కోట్లు ఖర్చు పెడుతున్నామని చెబుతున్నారని, అయితే యూనివర్సిటీలో పనిచేసే ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయం కనిపించదా అని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. యూనివర్సిటీల్లో చదువుకుంటున్న ఎస్సీ, ఎస్టీ , ఓబీసీ, మైనారిటీ విద్యార్థులకు స్కాలర్షిప్లు అందడం లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపి గౌడ్ పాల్గొన్నారు.

భూసేకరణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

జిల్లాలో జాతీయ రహదారులకు, రైల్వే లైన్ కు సంబంధించిన భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు.మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నందు జాతీయ రహదారి భూసేకరణ పురోగతి పనులపై జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తో కలిసి వర్చువల్ విధానంలో నేషనల్ హైవే పిడి లు, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీఓ లు రామ్మోహన్, కిరణ్మయి, భాను ప్రకాష్ రెడ్డి సంబంధిత మండలాల తాసిల్దార్లు తో సమీక్ష సమావేశం నిర్వహించారు. జాతీయ రహదారి భూసేకరణ పనులు త్వరిత గతిన పూర్తికావడానికి ప్రణాళికను రూపొందించుకొని పూర్తి చేయాలన్నారు. గ్రామాలదగ్గర వచ్చే సర్వీస్ రోడ్డు లకు సూచిక బోర్డులను గ్రామ ప్రజలకు తెలిసేలా ఏర్పాటు చేయాలని నేషనల్ హైవే అధికారులకు సూచించారు. తిరుపతి రేణిగుంట బైపాస్ సంబంధించిన పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీఓలను ఆదేశించారు. ఈ సమావేశంలో తిరుపతి, నెల్లూరు, చెన్నై నేషనల్ హైవే పిడీలు తిరుపతి వెంకటేష్, ఎం కె చౌదరి, టెక్నికల్ మేనేజర్ జయలక్ష్మి,, రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజనీరింగ్ రాధాకష్ణ పాల్గొన్నారు

'గంగమ్మ జాతర'కు రమ్మని కలెక్టరుకు ఆహ్వానం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ జాతర ఆహ్వాన పత్రికను జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్‌ను కలిసి దేవాదాయ శాఖ అధికారులు అందజేశారు. జాతర కు విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగ కుండా ప్రశాంత వాతావరణంలో జాతర ను జరిపి విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

అడవిలోకి చొరబడుతున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

భాకరపేట ప్రాంతంలో నిషేధిత అడవుల్లోకి ప్రవేశిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి పిడిలేని ఇనుప గొడ్డలి, బరిసలను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ. శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీ జి. బాలిరెడ్డి మార్గనిర్దేశకత్వంలో ఆర్ ఐ సాయి గిరిధర్ కు చెందిన ఆర్ ఎస్ ఐ వై విశ్వనాథ్ టీమ్ భాకరాపేట చామల సెక్షన్ లో కూంబింగ్ చేపట్టారు. తిరుపతి-పీలేరు రోడ్డు ఉత్తరం వైపున నిషేధిత అటవీ ప్రాంతంలో ముగ్గురు వ్యక్తులు వెళు తూ కనిపించారు. వీరిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా, వారు అడవుల్లోకి పారిపోయారు. అయితే టాస్క్ ఫోర్స్ పోలీసులు ఒక వ్యక్తిని పట్టుకోగలిగారు. అతని వద్ద నుంచి పిడిలేని గొడ్డలి, బారిస స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన వారి కోసం గాలిస్తున్నారు. పట్టుబడిన వ్యక్తిని తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ కు తరలించారు. సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



కొనసాగుతున్న టిడిఆర్ బాండ్ల మేళా

ప్రజాశక్తి -తిరుపతి టౌన్



తిరుపతి నగరంలో మాస్టర్ ప్లాన్ రోడ్లలో భూములు కోల్పోయిన వారికి టీడీఆర్ బాండ్లు ఇచ్చేందుకు నిర్వహిస్తున్న టిడిఆర్ బాండ్ల మేళా కార్యక్రమం కొనసాగుతోందని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం ఈ నెల 5 వ తేదీ నుండి నగరపాలక సంస్థ కార్యాలయంలో టిడిఆర్ బాండ్ల దరఖాస్తుల పరిశీలన కొరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించిన విషయం విదితమే. ఈ మేళాలో సుమారు 200 దరఖాస్తుల వరకు పరిశీలించినట్లు తెలిపారు. అర్హత ఉన్న వారికి టీడీఆర్ బాండ్లు పంపిణీ చేశామని తెలిపారు. మిగిలిన వారి యొక్క దరఖాస్తుల పరిశీలన, రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియను కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రజలు విచ్చేసి తమ భూములకు సంబంధించిన పత్రాలను అందజేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. డీసీపీ మహా పాత్ర, ఏసిపి లు, ప్లానింగ్ సెక్రటరీ లు అందరూ నగరపాలక సంస్థ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కమిషనర్ కోరారు.

వైభవంగా నడివీధి గంగమ్మ జాతర ఉత్సవాలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి 27వ డివిజన్ పరిధిలోని మల్లయ్యగుంట కట్ట నడివీధి గంగమ్మకు తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష దంపతులు సారె సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. మేయర్ డాక్టర్ శిరీష దంపతులు వైష్ణవి హాస్పిటల్ అధినేత డాక్టర్ మునిశేఖర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి, తాతయ్య గుంట గంగమ్మ గుడి ఆవరణం నుండి మేళతాళాలతో సారె అందజేశారు. భరణి యాదవ్, తులసి యాదవ్,హేమంత్ కుమార్ పాల్గొన్నారు.



బాల్య వివాహాలు అనర్థం



బాల్యవివాహాల అనర్థాలపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- కెవిబిపురం: బాల్య వివాహాలు అనర్థ దాయక మని పలువురు పేర్కొన్నారు. యాక్సెస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్ క్యాంపెయిన్‌లో భాగంగా ప్రగతి సంస్థ కేవీబీపురం మండల కేంద్రంలోని కొండల్లో ఆదవరం గ్రామంలో మంగళవారం బాల్యవివాహాలను అరికట్టాలని గ్రామస్తులతో అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రగతి సంస్థ డైరెక్టర్ కెవి రమణ విచ్చేశారు. 18 సంవత్సరాల లోపు ఆడపిల్లలకు, 21 సంవత్సరాల లోపు మగ పిల్లలకు ఎట్టి పరిస్థితుల్లో వివాహం చేయకూడదని అలా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. మహిళలపై హత్యాచారాలను, లైంగిక వేధింపుల నుండి రక్షించడానికి పోక్సో చట్టం కఠినంగా పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ సోషల్ వర్కర్ మల్లికార్జున, మధు కుమార్, లతా, మండల కోఆర్డినేటర్ ప్రభాకర్, అగ్రికల్చర్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గిరీష్ గ్రామస్తులు గుణశేఖర్, కుమార్, రత్నం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్చండి: ఎంఈవో


బడి ఈడు పిల్లలను బడిలో చేర్పిస్తున్న విద్యాధికారులు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: బడిఈడు పిల్లలను బడిలో చేర్చాలని ఎంఈవో మునిసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మండలం లోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బుచ్చినాయుడు కండ్రిగ పరిధిలోని పెద్దబాలివీడు చిన్న పాలివేడు పిచ్చి గుంటకాలనీ పాఠశాలలను ఎంఈవో మంగళవారం సందర్శిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి ఈడు పిల్ల లను బడిలో చేర్చాలని, 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను సమీప బిఎన్‌కండ్రిగ ఉన్నత పాఠశాలలో చేర్చాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను బిఎన్‌కండ్రిగ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతిలో చేర్పించారు. గ్రామాల్లో అన్ని ఇళ్లు తిరిగి బడిఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సతీష్ ,సుబ్రహ్మణ్యం, శైలజ, పిఆర్‌సి ప్రసూన పాల్గొన్నారు.


కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మహిళల జీవన ప్రమాణాల పెంపే లక్ష్యం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పేద మహిళల జీవనోపాధి పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రాథమిక కుట్టు శిక్షణను ప్రతిష్టాత్మకంగా నిర్వహి స్తోందని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు. గూడూరు డిఆర్‌డబ్ల్యు కళాశాలలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో కుట్టు శిక్షణా కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.పేద మహిళల జీవనోపాధి మెరుగుపరచడానికి రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రాథమిక కుట్టు శిక్షణ నిర్వహిస్తోందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు మస్తాన్ నాయుడు, బిల్లు చెంచురామయ్య, రహీం పాల్గొన్నారు.

ఎంపిటిసిలకు గౌరవ వేతనం ఇవ్వాలి


వినతిపత్రం అందిస్తున్న ఎంపిటిసి

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని పది మంది ఎంపీటీసీలకు 15 నెలలుగా గౌరవ వేతనం ఇవ్వలేదని, వెంటనే ఇప్పించాలని కోరుతూ ఎంపీడీఓ త్రివిక్రమరావుకు కాటూరు ఎంపిటిసి రవి మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం జనవరి నుండి ఎంపిటిసిలకు గౌరవ వేతనం ఇవ్వలేదని, గౌరవ వేతనం ఇప్పించాలని పలుమార్లు విన్నవించామన్నారు. స్పందించిన ఎంపీడీఓ త్రివిక్రమ రావు మాట్లాడుతూ ఎంపీటీసీ గౌరవ వేతానికి సంబంధించి మూడు దఫాలుగా బిల్లులను ఆన్ లైన్ లో అప్ లోడ్ చేశామని, అయితే మార్చి నెలాఖరున బిల్లులు తిరస్కరించినట్లు వచ్చిందని మళ్లీ ప్రభుత్వం నుండి ఆదేశాలు వస్తే మళ్లీ ఆన్ లైన్‌లో అప్ లోడ్ చేసి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్, కోట : సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం అని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నా రు. గూడూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే సునీల్ కుమార్ చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 8 లక్షల 52 వేల 743 రూపాయల 16 చెక్కులను పంపిణీ చేశారు. కోట మండలం కొక్కుపాడు గ్రామానికి చెందిన పలగాటి భాస్కర్ రెడ్డి కి రూ.3,22,160, వీరారెడ్డి సత్రం గ్రామానికి చెందిన కోమరి వేనయ్యకు రూ.24,064 రూపాయల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్, టిడిపి సీనియర్ నాయకులు పలగాటి భాస్కర్ రెడ్డి, వెంకన్నపాలెం సర్పంచ్ కోకర్ల మధు యాదవ్ పాల్గొన్నారు.


ఆలయంలో అన్నదానం చేస్తున్న దాతలు

ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు శ్రీ కల్యాణ వీరభద్ర స్వామి ఆలయంలో ప్రతి మంగళవారం అన్నదాన కార్యక్రమంలో భాగంగా నిర్వాహకులు మునిమోహన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. సంధ్యా లక్ష్మి జ్ఞాపకార్థం, దాతలు ఆరు ముళ్ళ శ్రీనివాసుల గౌడ్, విజయలక్ష్మి శ్రీరంగం గౌడ్, నిఖిల్ సాయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు.

చట్ట వ్యతిరేక రిజిస్ట్రేషన్‌లు రద్దు చేయాలి

- భూ సమస్యలు పరిష్కరించండి..
- ఆర్డీవో కార్యాలయ ఏవోకు వ్యవసాయ కార్మిక సంఘం వినతి

ప్రజాశక్తి- సత్యవేడు: చట్టాన్ని ఉల్లంఘిస్తూ నిర్వహించిన భూ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలని, వివిధ భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్ కార్యాలయ ప్రధాన పర్యవేక్షకులు రవికుమార్‌కు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్ మంగళవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా నోటిఫికేషన్ చేసిన గ్రామాల్లో ఇటీవల నిర్వహించిన చట్ట ఉల్లంఘన రిజిస్ట్రేషన్ లను తక్షణం రద్దు చేయాలని, వీటిని ఇలాగే కొనసాగిస్తే గ్రామాల్లో శాంతి భద్రతలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ప్రధానంగా సత్యవేడు సబ్ రిజిస్ట్రారుపై ప్రభుత్వం శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీ సిటీ విస్తరణకు మలివిడత నిర్వహిస్తున్న భూసేకరణ విషయాల్లో భూ అనుభవం ఉన్న ప్రతి రైతుకూ భూ పరిహారం అందించాలని, కొన్నిచోట్ల భూములు కొనుగోలు చేసి పత్రాలు ఉన్న రైతులకు కూడా న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 2013 సంవత్సరం భూ సేకరణ చట్ట ప్రకారం పరిహారాన్ని సన్న, చిన్న కారు రైతులకు న్యాయంగా చెల్లించాలని కోరారు. ఇరుగుళం, కొల్లడం, పెద్ద ఈటిపాకం, చిన్న ఈటిపాకం, రాళ్ల కుప్పం రెవెన్యూ గ్రామాల్లో భూముల రికార్డుల్లో కొంత తేడాలు వస్తున్నాయని, ఈ కారణంగా రైతులు పరిహారం పొందలేకపోతున్నారని, ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు రికార్డులను సరిచేసి, భూ అనుభవంలో ఉన్న రైతులను గుర్తించి న్యాయం చేయాలని ఆర్డీవో కార్యాలయ ఏవో ను కోరారు. అకారణంగా రైతులు కొందరు భూసేకరణను అడ్డుకోవడం, రైతుల్లో గందరగోళ పరిస్థితిని సృష్టిస్తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రశాంత వాతావరణంలో భూసేకరణ సాగేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వెలుగు రమేష్, రైతులు ఎం సత్యనారాయణ, డి వేణుగోపాల్, జె శ్రీనివాసులు, ఏ నాగరాజు పాల్గొన్నారు.


ఆర్‌డివో కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఎస్‌వియూకు భారీ ఆదాయపన్ను రిటర్న్స్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి 2023-24 ఆర్థిక సంవత్సరానికి భారీ స్థాయిలో ఇన్ కమ్ టాక్స్ డబ్బులు తిరిగి వచ్చాయని రిజిస్ట్రార్ ఆచార్య ఎం భూపతి నాయుడు తెలిపారు. విశ్వవిద్యాలయం చరిత్రలో ఇంత మొత్తం ఆదాయ పన్నుశాఖ నుంచి తిరిగి రావడం, విశ్వవిద్యాలయం ఖాతాలో చేరడం ఆనందంగా వుందన్నారు. గడచిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన విశ్వవిద్యాలయానికి రావలసిన ఇన్ కమ్ టాక్స్ రిటర్న్స్ గురించి విశ్వవిద్యాలయం కామర్స్ పూర్వ విద్యార్థి ఫల్గుణ కుమార్ తన బృందంతో కలిసి రెండు నెలలుగా లెక్కలు వేసి, ఎలాంటి ఫీజు తీసుకోకుండా డిపాజిట్లపై ఆదాయపన్ను శాఖకు చెల్లించిన డబ్బు నుంచి 1 కోటి3లక్షలా84 వేల రూపాయలు తిరిగి చెల్లించేలా కృషి చేశారన్నారు. ఫలితంగా ఆ డబ్బు విశ్వవిద్యాలయం ఖాతాలో మంగళవారం జమ అయ్యిందని తెలిపారు. గడచిన ఐదు సంవత్సరాల కాలంలో ఎస్‌వియూ చెల్లించిన ఆదాయ పన్ను నుండి దాదాపు 8.75 కోట్ల రూపాయలు తిరిగి చెల్లింపు చేసేలా లెక్కలు వేసి ఫాల్గుణ కుమార్ ఆదాయపన్ను శాఖకు సమర్పించారని, ఆ డబ్బు కూడా విశ్వవిద్యాలయానికి వచ్చే అవకాశం వుందన్నారు. ఈ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థిగా తన వంతు విశ్వవిద్యాలయం అభివృద్ధిలో భాగస్వామ్యులైన ఫల్గుణ కుమార్ ను విశ్వవిద్యాలయం పక్షాన ఇన్‌ఛార్జి విసి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి, భవిష్యత్తులో వారి సేవలు విశ్వవిద్యాలయానికి అందించాలని కోరారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి: జడ్జి


చట్టాలపై అవగాహన కలిగిస్తున్న జడ్జి

ప్రజాశక్తి - గూడూరు టౌన్: చట్టాలపై అవగాహన పెంపొందించు కోవాలని జిల్లా జడ్జి వెంకట నాగ పవన్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని ఓం శ్రీ సాయి రాం వృద్ధాశ్రమంలో మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 7 వ అదనపు జిల్లా జడ్జి వెంకట నాగపవన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కల్గి ఉండాలన్నారు. రాజ్యాంగంలో మహిళలు , వృద్ధులు, పిల్లలను రక్షించడానికి ప్రాథమిక హక్కులు ఇచ్చారన్నారు. విద్యార్థులను రక్షించుకోవాల్సిన బాధ్యత వుందన్నారు. మహిళలు , వృద్ధులు , పిల్లలు , రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని వాటిని తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం చట్టాల పై అవగాహన కల్పించారు. అనంతరం వృద్ధులకు పండ్లు , బిస్కెట్ ప్యాకెట్లు , మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి రాజేష్ , న్యాయవాదులు అరవ పార్వతయ్య, కోటేశ్వర రావు , మహబూబ్ బాషా పాల్గొన్నారు.

ఐకమత్యంతో సేవా కార్యక్రమాలు నిర్వహించాలి

ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రవి రాజు



మాట్లాడుతున్న రాష్ట్ర అసోసియేషన్ ప్రెసిడెంట్ రవిరాజు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఐకమత్యంతో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించుకోవాలని ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసి యేషన్ అధ్యక్షులు డాక్టరు రవిరాజు అన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ 302 సభ్యు లందరూ ఐకమత్యంతో సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రవి రాజు తెలిపారు. స్థానిక వాకర్స్ అసోసియేషన్ భవనంలో వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్టిక్ 302 క్యాబినెట్ సమావేశం. వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావిళ్ల మాధవ నాయుడు అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి పలు ప్రాంతాల నుంచి విచ్చేసి డెలిగేట్స్ పాల్గొని ఈ సందర్భంగా డాక్టర్ రవి రాజు, రావిళ్ళ మాధవ నాయుడు, మాట్లాడుతూ వాకర్స్ అసోసియేషన్ మంచి కార్యక్రమాలు చేపడుతున్నారు, అలాగే ఇంకా చాలా అసోసియేషన్ ఏర్పాటు చేయాలని. సభ్యులందరూ ఐకమత్యంతో సేవా కార్యక్రమాలు పనిచేసి అసోసియేషన్కు ఇంకా మంచి గుర్తింపు రావాలని కోరారు. నడకను గ్రామాల్లో కూడా తీసుకురావాలని. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, జూన్ 29న తిరుపతిలో జరిగే సమావేశంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో. వాకర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కెఎల్ మూర్తి, కార్యదర్శి మునికృష్ణయ్య, రఫీ అహ్మద్, కృష్ణంరాజు, రామచంద్ర నాయుడు, వాకర్ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థికి సన్మానం


ఇంటర్ విద్యార్థిని సన్మానిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి -సత్యవేడు: ఇంటర్ లో సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విద్యార్థి లక్ష్మీ ప్రసాద్ వెయ్యి మార్కులకు 981 మార్కులు సాధించి మండల టాపర్ గా తన సత్తా చాటారు. ఈ నేపథ్యంలో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థి లక్ష్మీప్రసాద్‌కు కలెక్టర్ వెంకటేశ్వర్లు మంగళవారం ప్రశంసాపత్రం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సత్యవేడు బిసి వసతి గృహ సంక్షేమ అధికారి కే గంగాధర్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టిన లక్ష్మీ ప్రసాద్ బీసీ వసతి గృహంలో బసచేస్తూ ప్రభుత్వ కళాశాలలో చదువుకుంటూ అటు తల్లిదండ్రులకు ఇటు ఉపాధ్యాయులకు పేరు తెచ్చేలా ఇంటర్ పరీక్ష ఫలితాలలో ఉత్తమ ప్రతిభ చాటి మండల టాపర్ స్థానాన్ని సాధించినందుకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థి లక్ష్మీ ప్రసాద్ ఇలాంటి ప్రతిభనే కొనసాగించి అత్యున్న స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిబిసిడబ్ల్యుఓ రాజేందర్ రెడ్డి ఏబిసిడబ్ల్యుఓ కృష్ణయ్య , జోష్న, విద్యార్థి అన్న పాల్గొన్నారు.


ప్రతిభ చూపిన విద్యార్థులను సన్మానించిన దృశ్యం

ప్రతిభ చూపే విద్యార్థులను ప్రోత్సహిద్దాం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: ప్రతిభ చూపే విద్యార్థులను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. పిచ్చాటూ రు, నాగలాపురం, నారాయణ వనం, కేవీబి పురం మండలాల పరిధిలో పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థు లను మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఆర్డీఓ భానుప్రకాష్ ముఖ్య అతిథులుగా హాజర య్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఈ ఏడాది పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన వారిని ప్రోత్సాహిద్దామని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించాలని, ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో వుందన్నారు. మంచి మేధావులున్న ప్రభుత్వ పాఠశాల్లో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. అంతకు ముందు ఆర్డీఓ మాట్లాడుతూ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి చక్కగా చదివి అత్యుత్తమ మార్కులతో మండల టాపర్ గా నిలిచిన విద్యార్థులకు హ్యాట్సాఫ్ తెలిపారు. అనంతరం నాలుగు మండలాల్లో అత్యుత్తమ మార్కులు(మొదటి, ద్వితీయ, తృతీయ) సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఆర్డీఓ భాను ప్రకాష్ తో కలిసి మెడల్ లు, ప్రశంసా పత్రాలు అందించి, శాలువా తో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులు, తల్లిదండ్రులకు, పుత్తూరు డీవైఈఓ ప్రభాకర్ రాజు, తహశీల్దారు టీవీ సుబ్రమణ్యం, ఎంపీడీఓ మహమ్మద్ రఫీ, ఎంఈఓ హేమామాలిని, బాబయ్య, యుగంధర్ రాజు, ఏఎంసీ ఛైర్మన్ డి ఇలంగోవన్ రెడ్డి, పద్దు రాజు, రవి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


కోట లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి అంజమ్మ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాష్ట్రీయ సేవా సమితి రాస్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో పుత్తూరు యునియన్ బ్యాంక్ ఆవరణలో మంగళవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. మండే వేసవిలో నిత్యం బ్యాంకుకు ఎక్కువగా జన సంచార వస్తుంటారని, జనం అధికంగా వున్న శివాలయం గుడివీధిలో ప్రజలలు దాహార్తి తీర్చేందుకు ఈ చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ మేనేజర్ హరిత మాట్లాడుతూ వేసవిలో ఎంతో మంది పాదచారుల దాహార్తిని దృష్టిలో ఉంచుకొని రాస్ ద్వారా ముఖ్యంగా మహిళల ఆలోచనలలో చలివేంద్రం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. నిత్యం బ్యాంకు సేవలకు వచ్చే ఖాతా దారులే కాకుండా పాదచారులకు కూడా ఈ చలివేంద్రం దాహార్తి తీరుస్తుందని, రాస్ కార్యక్రమాలు పలువురికి మార్గ దర్శకం అవుతుందన్నారు. ఈ సందర్భంగా అందరికీ మజ్జిగ పంపిణీ చేశారు. సుమారు 20 మంది మహిళా సంఘం లీడర్లు, రాస్, అధికారులు రవి, తేజ, మునిశేఖర్, ప్రకాష్, ఏకాంబరం, రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

కోట : కోట మండలంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద మంగళవారం చలివేంద్రం ప్రారంభించారు. ఈ మేరకు కోట ఎంపీపీ దాసరి అంజమ్మ, జెడ్‌పిటిసి దాసరి కోటయ్య చేతుల మీదుగా చలివేంద్రంలో భాగంగా తాగునీరు, మజ్జిగను ఏర్పాటు చేసి ప్రారంభించారు. అనంతరం కోట ఎంపీపీ దాసరి అంజమ్మ, దాసరి కోటయ్యలు మాట్లాడుతూ స్థానిక కోట ఇన్‌ఛార్జి ఎంపీడీవో గోపి ఆదేశాల మేరకు మండల కార్యాలయానికి పలు పనుల నిమిత్తం వచ్చే ప్రజల కోసం దాహార్తిని తీర్చడానికి ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ నరేష్ బాబు, ఎమ్పీడీవో కార్యాలయ సిబ్బంది ఉన్నారు.


మజ్జిగ పంపిణీ చేస్తున్న బ్యాంకు అధికారులు

తాళపత్రాలు బహూకరణ


వర్సిటీ అధికారులకు తాళ పత్రాలు అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - క్యాంపస్ : కర్ణాటక బెంగుళూరుకు చెందినవెల్లలూరి వేంకటాద్రి శర్మ, పద్మా వతమ్మ తరతరాలుగా వారు రక్షణ చేపట్టిన అరుదైన తాళపత్రాలను తిరుపతి పట్టణంలో నివసిస్తున్న వారి చెల్లెలు భాస్కర త్రిపురాంబ, భర్త భాస్కర రామశాస్త్రికి అందించారు. వారి కుమార్తె భాస్కర భారతీదేవి శ్రీవేంటేశ్వర వేదవిశ్వవిద్యాలయం, పరిశోధన ప్రకాశన విభాగం తాళపత్ర పరిరక్షణా కేంద్రం ద్వారా నిర్వహిస్తున్న భారతీయ వారసత్వ సంపద అయిన తాళపత్రాల సంరక్షణను గురించి తెలుసుకున్న వారే స్వయంగా శ్రీవేంకటేశ్వర వేదవిశ్వవిద్యాలయానికి వచ్చి తాళపత్ర పరిరక్షణా కేంద్రంను సందర్శించి అక్కడ జరుగుతున్న సంరక్షణాచర్యలను పరిశీలించి భారతీయ విజ్ఞానం భావితరాలకు అందించాలన్న సంకల్పంతో వారివద్దనున్న తాళపత్రాలను విశ్వవిద్యాలయ ఉప కులపతులు ఆచార్య రాణి, సదాశివ మూర్తి ద్వారా అందించారు. ప్రాథమికంగా ఈ తాళపత్రాలు భాస్కర రామాయణానికి సంబంధించినవిగా గుర్తించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య పి భాస్కరుడు, డైరెక్టర్ ఆచార్య రాధేశ్యామ్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

యువకుడి మృత దేహం లభ్యం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రూరల్ మండల పరిధిలోని సంత దాసు పల్లి గ్రామ చెరువులో యువకుడి మృత దేహం లభ్యమైంది. గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ కథనం మేరకు మృతుడు సంతదాసు పల్లి గ్రామానికి చెందిన బిల్లు ప్రశాంత్ (31) గా గుర్తించామన్నారు. ఇతను ప్రస్తుతం గూడూరులోని వాముల మిట్టలో నివసిస్తున్నాడని, ఈనెల 26 వ తేదీ ఇంటి నుండి వెళ్లి పోయాడని కుటుంబ సభ్యులు గూడూరు ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారని తెలిపారు. మిస్సింగ్ కేసు నమోదు చేశామని తెలిపారు. ఆర్థిక సమస్యలే మృతికి గల కారణాలు అని కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. గూడూరు ఏరియా ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి అనంతరం వారి బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.


ఉపాధి ఏపీవో డ్వామా పీడీకి సరెండర్

ప్రజాశక్తి -కోట : కోట మండలంలో ఉపాధి హామీ ఏపీవో పూర్ణిమను తిరుపతి జిల్లా డ్వామా పీడీ కార్యాలయానికి సరెండర్ చేసినట్లు కోట ఇన్‌ఛార్జి ఎంపీడీవో గోపి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి గోపి మాట్లాడుతూ మూడు రోజుల నుండి ఎలాంటి అనుమతులు లేకుండా విధులకు గైర్హాజరవడంతో సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుండి తిరుపతి జిల్లా పీడీ శ్రీనివాసప్రసాద్‌కు సరెండర్ చేసుకోవాలని సిఫారసు చేశామన్నారు. అంతే కాకుండా ఇటీవల ఉపాధి పనుల్లో లోపాలు ఉండడంతో పీడీ బహిరంగంగా ఏపీవోను నిలదీయడం అందరికీ తెలిసిందే. అయితే ఆ పనుల్లో లోపాలు గుర్తించడంతో తక్షణమే ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లను సస్పెండ్ చేశారు. అయితే ఏపీవోపై త్వరలో చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ గతంలోనే విలేకరుల సమక్షంలో తెలిపారు. ప్రస్తుతం ఆమెను బదిలీ చేస్తారా? లేదా అనే కోణంలో కోట ప్రజలు ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. ఏదిఏమైనా ఆమెను బదిలీ చేస్తారా.. లేదా ఇక్కడే కొనసాగిస్తారా? అనే విషయం అందరిలో సందిగ్ధత నెలకొంది. ఇప్పటికైనా తిరుపతి జిల్లా డ్వామా పీడీ కోట మండలంలో తరచుగా పర్యవేక్షించి ఎలాంటి రాజకీయాలకు తావు లేకుండా సక్రమంగా ప్రజలకు ఉపాధి పనులు సక్రమంగా కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోట మండల ప్రజలు కోరుతున్నారు.


ప్రిన్సిపాల్ డాక్టరు పద్మావతిని సన్మానిస్తున్న దృశ్యం

డాక్టర్ పద్మావతికి సన్మానం

ప్రజాశక్తి - క్యాంపస్ : అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహా సంఘం టీటీడీ విద్యాసంస్థల కన్వీనర్, టిటిడి ఎస్పీడబ్ల్యు పాలిటెక్నిక్ కాలేజీ ఫార్మసీ విభాగాధిపతి డాక్టర్ పద్మావతి ఆ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులైన సందర్భంగా ఏబిఆర్ఎస్ఎం తిరుపతి విభాగం తరపున ఆ కళాశాలలో మంగళవారం ఆమెను కలిసి సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం ఉంచి ప్రిన్సిపాల్ గా నియమించిన టిటిడి ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్పీడబ్ల్యు పాలిటెక్నిక్ కాలేజీలో విద్యార్థుల ప్రవేశాల సంఖ్యను పెంచేందుకు, కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబిఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వైవి రామిరెడ్డి, రాష్ట్ర కోశాధికారి ప్రొఫెసర్ ఎం రాజశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంజని, రమేష్, ప్రతినిధులు శ్రీలత, సంధ్య, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.


రిలే దీక్ష నిర్వహిస్తున్న ఆర్‌టిసి కార్మికులు

రెండో రోజుకు ఆర్‌టిసి కార్మికుల దీక్ష

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అక్రమ సస్పెన్షన్, రిమూవల్స్‌ను నిలుపుదల చేయాలని ఎన్ఎంయు ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. ఈ దీక్షల్లో ఆ యూనియన్ మాజీ అధ్యక్షులు డివిఆర్ కుమార్, డిపో అధ్యక్షులు ఎస్ సుందరం పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ఎస్ సుందరం మాట్లాడుతూ ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని జీవోలో వున్న విధంగా, 114 జీవోలో పొందుపరిచిన విధంగా నైట్ హాల్టుకు 150 నుండి 400 రూపాయలకు పెంచాలని కోరారు. ఉద్యోగ భద్రత కోసం 1/2019 సర్క్యులర్ అమలు చేయాలన్నారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలన్నారు. ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని కొనసాగించాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోన్ కమిటీ కెఆర్ ఆర్ముగం, డిపో వైస్ ప్రెసిడెంట్ కే మనోహర్, డిపో జాయింట్ సెక్రెటరీ బిసి శేఖర్, జాయింట్ సెక్రెటరీ ఎం వి కుమార్, సిసిఎస్ డెలిగేటెడ్ కే రమేష్ బాబు, అసిస్టెంట్ సెక్రెటరీ బి నాధముని, పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

మండల సమావేశంలో ఎంపిపి ఆదేశం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా పరిష్కరించాలని పుత్తూరు ఎంపిపి మునివేలమ్మ అధికారులకు సూచించారు. పుత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఆదేశించారు. తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎక్కడైనా సమస్య వుంటే తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. తడుకు, చిరుగు రాజుపాలెం సర్పంచ్‌లు మాట్లాడుతూ ఉపాధి పనుల కింద శ్మశాన వాటిక అభివృద్ధి, రోడ్ల పక్కన చెట్లు నాటడం వంటి పనులు చేపట్టాలన్నారు. స్పందించిన ఎంపీడీవో రమేష్ బాబు, ప్రజాప్రతినిధులు ఏ పనులు కావాలా లో గుర్తిస్తే ఆ పనులు చేపడుతామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో విద్యుత్ తీగలు ఇబ్బందికరంగా వున్నాయని వీటిని సక్రమంగా ఏర్పాటు చేయాలని సర్పంచులు కోరారు. ఏఈ సాయినాథ్ మాట్లాడుతూ ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని కాంట్రాక్టర్లు వస్తే పని పూర్తి చేస్తామని సూచించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత చేనేత, మరమగ్గాల, కార్మికులకు 500 యూనిట్లు ఉచితంగా అందిస్తు న్నారని విద్యుత్ సమస్య పరిష్కారం కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల వారికి పీఎంవై యోజన కింద ఉచిత శౌర్య విద్యుత్ ఏర్పాటు చేస్తున్నా రన్నారు. తహశీల్దారు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామాల్లో శ్మశానాలు లేని చోట గుర్తించి సర్వే చేసి వాటిని హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వం రైతులు భూ సర్వే పరిష్కారానికి రీ సర్వే చేపట్టి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తామని ఈ సర్వే వల్ల రైతులకు ఆందోళన చెందవద్దన్నారు. సర్వే చేసి కొత్తగా పొరబాట్లు ఉంటే సరిదిద్ది పట్టాదారు పాస్ బుక్ అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు మునుస్వామి రెడ్డి, విమలమ్మ, ఈఓ ఆర్‌డి దేవిక, ఎంఈఓ తిరుమలరాజు, ఏపీవో మమతా రాణి, సూపరింటెండెంటు వాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మండల సమావేశంలో సమస్యలు వింటున్న ఎంపిపి మునివేలమ్మ